366)శ్రీ

ప॥ హరి నీదాసులభాగ్య మిది యెంతని చెప్పేము। విరివైననీసుద్దులు వింటిమయ్యా॥

చ॥ నెమ్మదిని నీవనేటినిధానము గన్నవారు। కిమ్ములసంపన్నులై సుఖింతురయ్యా।
కమ్మటి నీభక్తియనేకామధేను వున్నవారు। వుమ్మడి నచ్చికము లేకుందురయ్యా॥

చ॥ చేరి నీపై చింతయనేచింతామణిగలవారు। కోరినట్లల్లా బదుకుదురయ్యా।
సారపునీకృపాపారిజాతమబ్బినవారు। బోరన సంతోసాల బొదలుదురయ్యా॥

చ॥ హత్తి నీనామమనేఅమృతముగలవారు। నిత్తెమైనపదవుల నిలుతురయ్యా।
యిత్తల శ్రీవేంకటేశ ఇన్నిటా నన్నేలితివి। సత్తుగా నీవారు నాకు జనవిత్తురయ్యా॥